# సాక్షి కర్నూలు

సోమవారం । 12 । మే । 2025




## మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళా వేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన అండాళ్ కూచిపూడి నాట్యాలయం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



## బంగారు హారం విరాళం

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి హైదరాబాద్ నగరానికి చెందిన డోర్నాల రామచంద్రమూర్తి 57 గ్రాముల బంగారు హారాన్ని ఆదివారం విరాళం అందజేశారు.



## లైఫ్ డో'నర్స్'

రోగంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చేరిన వారికి మేమున్నామని ధైర్యం చెప్పే వారే నర్సులు. నేడు ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

8లో▸

## న్యూస్‌రీల్

### కమనీయం.. కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: నరసింహస్వామి జయంతి వేడుకల సందర్భంగా ఉరుకుంద దేవాలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఉదయం సుదర్శన హోమం పూర్తి చేశారు. తరువాత భక్తులు కూడా పాల్గొని హోమాలు చేపట్టారు. స్వామి వారి మూలవిరాట్‌ను వెండి ఆలంకరణలో ప్రత్యేక పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చస్తశారు. దేవాలయపు డిప్యూటీ కమిషనర్ విజయరాజు, తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

### తెలంగాణ ఈఏపీసెట్‌లో 18వ ర్యాంక్

● పత్తికొండ విద్యార్థి ప్రతిభ



చెన్నకేశవ

పత్తికొండ రూరల్: తెలంగాణ ఈఏపీసెట్‌లో పత్తికొండ విద్యార్థి కప్పట్రాళ్ల చెన్నకేశవ ప్రతిభ కనబరిచాడు. మొత్తం 160కి గాను 136.69 మార్కులు సాధించి 18వ ర్యాంకు సాధించాడు. ఉపాధ్యాయురాలు కల్యాణికుమారి, రమేష్ దంపతుల కుమారుడైన కప్పట్రాళ్ల చెన్నకేశవ పదో తరగతిలో 579 మార్కులు సాధించాడు. హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ చదివి 991మార్కులు తెచ్చుకున్నాడు. ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 206 ర్యాంకు సాధించాడు. తెలంగాణ ఈఏపీసెట్‌లో 18వ ర్యాంకు సాధించిన కుమారుడిని తల్లిదండ్రులు అభినందించారు.

### రేపు గోరుకల్లుకు ఎక్స్‌ఫర్ట్ కమిటీ రాక

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయానికి మంగళవారం( రేపు) ఎక్స్‌ఫర్ట్ కమిటీ రానున్నట్లు ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఇటీవల గోరుకల్లు జలాశయం కట్ట కుంగిన విషయం తెలిసిందే. అయితే పదేపదే కట్ట ఒకే చోట కుంగిపోవడంతో ఇంజినీర్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వం ఎక్స్‌ఫర్ట్ కమిటీని నియమించింది. దీంతో ఈ కమిటీ 13న పర్యటించనుంది. డ్యామ్‌ను పరిశీలించిన తర్వాత తగు సూచనలు జారీ చేయనున్నారు.

### ఆర్‌యూ, పీజీ కళాశాలలకు వేసవి సెలవులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ, అనుబంధ పీజీ కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వి. వెంకట బసవరావు ఆదేశాల మేరకు జూన్ 15వ తేదీ వరకు సెలవులు ఇచ్చినట్లు వర్సిటీ అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ భరత్‌కుమార్ పేర్కొన్నారు. 16వ తేదీ పునః ప్రారంభమవుతుందని తెలిపారు. పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ షెడ్యూల్‌ను పాటించాలని పేర్కొన్నారు.

### నేటి పరిష్కార వేదిక రద్దు

కర్నూలు(సెంట్రల్): ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను కొన్ని అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు ఇన్‌చార్జి జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్కువ మంది పోలీసు అధికారులు బందోబస్తు విధుల్లో ఉండడంతోనే కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### రూ.10.25 లక్షల మోసం

కర్నూలు(సెంట్రల్): సెల్‌ఫోన్‌కు వచ్చిన చిన్న సందేశాన్ని చూసి ఒక వ్యక్తి మోసం పోయి రూ.10.25 లక్షలు పోగొట్టుకున్నాడు. కర్నూలు రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కర్నూలులోని అమీన్ అబ్బాస్ నగర్‌లో ఉదయ్‌కుమార్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఇటీవల ఆయన సెల్‌ఫోన్‌కు అల్లైస్ బ్లూ అనే సంస్థలో పెట్టుబడి పెడితే పెద్ద లాభాలు వస్తాయని మెస్సేజ్ వచ్చింది. దానిని చూసిన ఆయన తన వద్ద ఉన్న రూ.10.25 లక్షలను అందులో పెట్టాడు. చివరకు మోసపోయానని తెలుసుకుని ఆదివారం రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సైబర్ కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


### నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి(సోమ వారం)నుంచి మొదలై ఈ నెల 20వ తేదీ వరకు సాగనున్నాయి. ఇందుకు జిల్లాలో 52 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

# ధరలు మండుతూ.. కూర'గాయాలు' చేస్తూ!

**కూరగాయల సాగుకు తగ్గిన ప్రోత్సాహం**

- సబ్సిడీపై విత్తనాల పంపిణీ సున్నా
- గత ఏడాది 6,976 ఎకరాల్లో కూరగాయల సాగు
- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- భారీగా పెరుగుతున్న ధరలు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న వినియోగదారులు



కర్నూలు(అగ్రికల్చర్): నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం చేతులెత్తేసింది. కూరగాయల సాగుకు ఎలాంటి ప్రోత్సాహం అందించకపోవడం ధరలపై ప్రభావం చూపుతోంది. ప్రసుత్తం మార్కెట్‌లో కూరగాయల ధరలు మండుతున్నాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రైతులు పండించిన ధాన్యం, వేరుశనగ, కందులు, కొర్రలు, సజ్జలతో సహా కూరగాయలు అమ్మడానికి పోతే తక్కువ ధరలు లభిస్తున్నాయి. కొనడానికి పోతే మాత్రం చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ కారణంగా రైతులకు సాగు భారమవుతోంది. డిమాండ్‌కు తగినట్టు మార్కెట్‌లోకి కూరగాయల సరఫరా లేకపోవడం కొరతకు కారణమవుతోంది. అంతంతమాత్రం సాగు చేసిన కూరగాయల పంటలు కూడా అకాల వర్షాలకు దెబ్బ తింటుండటంతో దిగబడులు పడిపోయాయి. గత మూడు, నాలుగేళ్లతో పోలిస్తే రబీ కూరగాయల సాగు పడిపోయింది. వేసవిలో కూరగాయల కొరత ఉత్పన్నం కాకుండా సమ్మర్ క్రాప్స్‌ను ప్రోత్సహించాల్సి ఉన్నా ఆ దిశగా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. ఫలితంగా కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి.

**కలసిరాని కూరగాయల సాగు**

రైతుల్లో కూరగాయల సాగుపై ఆసక్తి తగ్గిపోతోంది. 2023–24 ఈక్రాప్ ప్రకారం ఉల్లి, టమాట సహా కూరగాయల సాగు 80,614 ఎకరాల్లో ఉంది. వీటిని మినహాయిస్తే కూరగాయల పంటలు 31,868 ఎకరాల్లో సాగయ్యాయి. సాగు పుష్కలంగా ఉండటంతో కూరగాయల కొరత ఏర్పడలేదు. ధరలు పెరిగిన దాఖలాలు లేవు. 2024–25 సంవత్సరంలో టమాట, ఉల్లితో సహా కూరగాయల సాగు 26,087 ఎకరాల్లో ఉంది. ఉల్లి, టమాట పంటలే 22,736 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ పంటలను మినహాయిస్తే కేవలం కూరగాయల పంటలు 3,351 ఎకరాలకే పరిమితం అయ్యాయి. 2023–24 సంవత్సరంతో పోలిస్తే 2024–25లో కూరగాయల సాగు కలసి రాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతంతమాత్రం సాగైన పంటలు కూడా అధిక వర్షాలు, అకాల వర్షాలతో దెబ్బ తిన్నాయి. దీంతో దిగుబడులు పడిపోయి కొరత ఏర్పడటం ధర పెరుగుదలకు కారణమవుతోంది.

**టమాట ధర పెరిగే అవకాశం**

గత ఏడాది మే నెలతో పోలిస్తే కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం టమాట, బెండ ధరలు మాత్రమే ఊరట కలిగిస్తున్నాయి. రానున్న రోజుల్లో టమాట ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. కర్నూలు జిల్లాలో ప్రస్తుతం టమాట సాగు పూర్తిగా పడిపోయింది. మదనపల్లి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి టమాట దిగుమతి అవుతోంది. అక్కడ కూడా పంట క్రమంగా తగ్గుతోంది. దీంతో రానున్న రోజుల్లో టమాట ధరలు కూడా పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వెల్దుర్తి, కోడుమూరు, క్రిష్ణగిరి, గూడూరు, సీ.బెళగల్, డోన్ తదితర ప్రాంతాల్లో కూరగాయల ధర మండుతోంది. చాలాచోట్ల కూరగాయల ధరలు రూ.100 వరకు చేరాయంటే ఆశ్చర్యం కలుగకమానదు.

**ధరల పెరుగుదల ఇలా..**

| కూరగాయ పేరు | ఏప్రిల్ 11న ధర | మే 11న ధర |
|---|---|---|
| వంకాయ | 16/24 | 34/48 |
| కాకర | 30 | 54 |
| క్యాలీఫ్లవర్ | 30 | 44 |
| క్యారెట్ | 24 | 40 |
| బీన్స్ | 80 | 100 |
| చిక్కుడు | 50 | 70 |
| క్యాప్సికం | 50 | 64 |
| పచ్చిమిర్చి | 30 | 54 |
| బీర | 36 | 50 |

**ఖర్చు పెరిగింది**



ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయాయి. వీటికి తోడు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. ఏ కూరగాయ తీసుకున్నా కిలో ధర రూ. 50 పైగా ఉంది. మా కుటుంబానికి నెలకు రూ. 15,000 ఆదాయం ఉంది. ఇందులో కూరగాయలు, నిత్యావసర వస్తువులకే రూ.6,000 వరకు ఖర్చు అవుతుంది. నాలుగు నెలల క్రితంతో పోలిస్తే రూ.2000 వరకు ఖర్చు పెరిగింది. ప్రభుత్వం చొరవ తీసుకొని నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి.

– నిర్మలభాయి, కృష్ణానగర్, కర్నూలు

**కొనలేం తినలేం**



ధరలు పెరగడంతో కూరగాయలు కొని తినలేని పరిస్థితి ఏర్పడింది. కుటుంబానికి ఆదాయం పెరగడం లేదు. నిత్యావసర ధరలు ఇంకా పెరుగుతాయి అంటున్నారు. ఇప్పటికే బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు భారీగా పెరిగిపోయాయి. నెలకు నాలుగైదు వేల రూపాయల వరకు ఖర్చులు ఉన్నాయి. ప్రభుత్వం ధరల భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది.

– కె. రత్నమ్మ, కర్నూలు

**ప్రభుత్వ ప్రోత్సాహం కరువు**

- ➤ కూరగాయల కొరత ఏర్పడకుండా సాగును ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
- ➤ కూటమి ప్రభుత్వంలో కూరగాయల సాగుకు ఎలాంటి ప్రోత్సాహం లభించని పరిస్థితి నెలకొంది.
- ➤ సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కూరగాయల సాగుకు ప్రోత్సాహకాలు ఉన్నా ఆచరణలో అమలు కావడం లేదు.
- ➤ 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాల్సి ఉన్నా 2024–25 సంవత్సరంలో ఒక్క రైతుకు కూడా విత్తనాలు ఇవ్వకపోవడం గమనార్హం.

## జిల్లా అంతటా అప్రమత్తం

● తనిఖీలు నిర్వహించిన పోలీసులు



కర్నూలు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు: దేశ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులతో ఆదివారం జిల్లా అంతటా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు సబ్ డివిజన్ అధికారుల పర్యవేక్షణలో తనిఖీలు సాగుతున్నాయి. ముఖ్యంగా రవాణా వాహనాలపై దృష్టి సారించారు. పార్సల్ కార్యాలయాలు, మార్కెట్ల నుంచి సరుకులు తరలించే వాహనాలను క్షుణంగా తనిఖీ చేశారు.

**తనిఖీలు ఇలా..**

జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, వ్యాపార వాణిజ్య సముదాల ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో సంఘ విద్రోహ శక్తులు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసవుకోని విచారిస్తున్నారు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు శ్రీధర్, నాగరాజారావు ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైల్వే పరిసర ప్రాంతాల్లోని ఆటో డ్రైవర్లను అప్రమత్తం చేసి వారికి ముందస్తు జాగ్రత్తల గురించి తెలియజేశారు. యాంటీసబోటేజ్(విధ్వంస వ్యతిరేక)తనిఖీ చేపట్టారు. అదే సమయంలో కాచిగూడ నుంచి గుంతకల్లుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు రావడంతో అగుగడుగున తనిఖీలు చేసి అనుమానస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించారు. కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో కూడా బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ బాబు ప్రసాద్ మాట్లాడుతూ.. అనుమానాస్పద వ్యక్తులు తారస పడితే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



శ్రీమఠం ప్రాంగణంలో భక్తులు

## శ్రీమఠం... భక్తజన సంద్రం



బంగారు పల్లకీలో బృందావన ప్రతిమ ఊరేగింపు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన మంత్రాలయానికి కర్ణాటక, తమిళనాడు, తెలుగు రాష్ట్రాల నుంచి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. తుంగాతీరం, మధ్వ కారిడార్, నది కారిడార్, మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి దర్శన క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. మూలబృందావన దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. అన్నపూర్ణ భోజన, పరిమళ ప్రసాదం కౌంటర్లు రద్దీగా దర్శనమిచ్చాయి. ముందుగా భక్తులు గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని రాఘవేంద్రుల దర్శనం చేసుకున్నారు. భక్తుల రాకతో పురవీధులు కళకళలాడాయి.

## శ్రీశైలంలో భక్తుల సందడి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.



పలువురు భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొంది స్వామివారి స్పర్శ దర్శనం చేసుకున్నారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

## అప్పులే ఉరితాడై..

● ఆత్మహత్య చేసుకున్న వ్యాపారి



ఆత్మహత్య చేసుకున్న వెంకటేశ్వర్లు

కర్నూలు: కుమారుడు చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న బెంగతో తండ్రి వెంకటేశ్వర్లు (50) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన కర్నూలు పాతబస్తీలోని చిత్తారి వీధిలో నివసిస్తున్నాడు. కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న స్వర్ణ కార కాంప్లెక్స్‌లో బంగారు దుకాణం నడుపుతున్నాడు. ఈయన భార్య పద్మావతి ఐదు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో ఉండేవాడు. ఈయన కొడుకు రాఘవేంద్ర బీటెక్ పూర్తి చేసి వెంకాయపల్లె వద్ద ఒక ఇంజినీరింగ్ కళాశాలలో పెయింగ్ గెస్ట్ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. ఇందుకోసం దాదాపు రూ.30 లక్షలు వరకు అప్పు చేశాడు. ఈయన కూతురు హర్షవర్ధిని డెన్మార్క్‌లో చదువుతోంది. కొడుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడం, భార్య గుండెపోటుతో మృతిచెందడంతో ఈయన మనోవేదనకు గురై ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో వైర్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఈయన తల్లి రామకోటమ్మ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటుండగా వెంకటేశ్వర్లు రెండో అంతస్థులో ఉంటాడు. మధ్యాహ్నం భోజనం కోసం తల్లి రామకోటమ్మ బెల్ కొట్టినప్పటికీ కొడుకు రాకపోవడంతో పైకెక్కి చూడగా ఉరికి వేళాడుతూ కనిపించాడు. ఇరుగు పొరుగు సాయంతో ఉరి నుంచి తప్పించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యమ బాటలో ఆర్టీసీ ఉద్యోగులు

● రేపు డీపీటీఓ ఆఫీస్‌ల ఎదుట ధర్నా

కర్నూలు సిటీ: సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. గత నెల 2 నుంచి విడతల వారీగా ఆందోళనలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడంతో రేపు(మంగళవారం) జిల్లా ప్రజా రవాణా సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిందని, అప్పట్లో ఇచ్చిన 1/2019 సర్క్యులర్‌ను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగులపై వేధింపులు ఉంటున్నాయని, సస్పెన్షన్లు, సర్వీస్ నుంచి తొలగించడం, ఇంక్రిమెంట్లలో కోతలు విధిస్తున్నట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ఇవీ..**

- ➤ ఉద్యోగుల భద్రత కోసం జారీ చేసిన సర్క్యులర్ 1/2019ను అమలు చేయాలి.
- ➤ అక్రమ సస్పెన్షన్స్, రిమూవల్స్‌ను నిలిపి వేయాలి.
- ➤ జీఓ ప్రకారం మహిళ ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలి.
- ➤ ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలి.
- ➤ నైట్ ఆవుట్ అలవెన్సులను రూ.150 నుంచి రూ.400కు పెంచాలి.
- ➤ ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సంస్థ మాత్రమే కొనుగోలు చేయాలి.
- ➤ అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలి.
- ➤ ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలి.

## రాష్ట్రంలో అరాచక పాలన!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

- మాజీ మంత్రి విడుదల రజనీపై పోలీసుల దాష్టీకం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. మాజీ మంత్రి విడుదల రజనీపై పోలీసులు చేసిన దాష్టీకాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. సీఐ సుబ్బరాయుడిపై పోలీసు ఉన్నతాధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ... రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కల్పన విషయంలోను పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. మహిళ అని చూడకుండా రాత్రి పోలీసు స్టేషన్‌కు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన సీనియర్ మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట కేశవ రెడ్డి విషయంలోను పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరించారన్నారు.

**పవన్‌కళ్యాణ్ ఎక్కడ?**

ఎన్నికల ముందు 30 వేల మంది మహిళలు కనిపించడంలేదంటూ ఊగి..ఊగి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పలు సభల్లో మాట్లాడారని ఎస్వీ గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ ఒక్క మహిళనైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలం అవుతుందని, ఇప్పటి వరకు సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన పథకాలు అమలు చేయడం చేతకాక ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. సినీ నటుడు పోసాని మురళిపై అక్రమంగా 16 కేసులు నమోదు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు విసుగు చెందారని..వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. తప్పు చేసిన పోలీసులకు శంకరగిరి మాన్యాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి షరీఫ్, బీసీ సెల్ అధ్యక్షులు రాఘవేంద్ర నాయుడు, కల్లా నరసింహారెడ్డి, ధనుంజయ ఆచారీ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## రైతును కాటేసిన రాత్రి కరెంట్

● విద్యుదాఘాతంతో అన్నదాత మృతి



మునిస్వామి (ఫైల్)

కోసిగి: వ్యవసాయానికి రాష్ట ప్రభుత్వం రాత్రి వేళ విద్యుత్ సరఫరా ఇస్తుండటంతో రైతు ప్రాణం కోల్పోయాడు. పగటి సమయంలో విద్యుత్ సరఫరా ఉంటే ఇంటి పెద్ద బతికి ఉండేవాడని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అయ్యారు. కోసిగి మండలం చింతకుంట గ్రామానికి చెందిన బాపుల దొడ్డి మునిస్వామి(63) పొలంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... మునిస్వామికి మూడు ఎకరాల పొలం ఉంది. ఇటీవల వేరుశనగ పంట సాగు చేశాడు. పొలంలోని వ్యవసాయ బోరులో నీరు అడుగంటడంతో శనివారం అదనంగా పైపులైన్లు వేశారు. తెల్లవారుజామున 3గంటలకు విద్యుత్ సరఫరా ఇస్తున్నారు. పైరుకు నీళ్ల పెట్టాలని తన చిన్న కుమారుడు నల్లారెడ్డితో కలిసి బాపుల దొడ్డి మునిస్వామి పొలానికి వెళ్లాడు. పైరుకు నీళ్ల కట్టే పనిలో కుమారుడు నిమగ్నమై ఉన్నాడు. కొత్తగా పైప్‌లైన్ దింపిన బోరు నుంచి నీళ్లు వస్తున్నాయా లేదా అని మునిస్వామి పరిశీలిస్తున్నాడు. పైప్‌లైన్ పట్టుకోగా విద్యుత్ ఎర్తింగ్ కావడంతో షాక్‌కు గురై అక్కడే కుప్పకూలిపోయాడు. కుమారుడు గమనించి తండ్రిని లేపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ప్రైవేట్ వాహనంలో కోసిగి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతినికి భార్య పార్వతి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రాత్రి వేళ విద్యుత్ సరఫరా ఇవ్వడంతోనే మునిస్వామి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.



మృతికి కారణమైన బోరు

## క్లుప్తంగా

### బంగారు, డబ్బు మాయం

కొలిమిగుండ్ల: ప్రమాదానికి గురైన వాహనంలో ఉన్న బంగారు ఆభరణాలు, డబ్బు మాయమైంది. కొలిమిగుండ్ల సమీపంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలోని మలుపు వద్ద శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు, బొలెరో జీపు ఎదురురెదురుగా ఢీకొని, నలుగురు గాయపడిన విషయం విదితమే. కనకాద్రిపల్లెకు చెందిన నరేష్, నందిని దంపతుల పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయించేందుకు పాములేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడే దగ్గరి బంధువులు పుట్టువెంట్రుకల సందర్భంగా పిల్లలకు ఆరు బంగారు ఉంగరాలు, గొలుసు పెట్టారు. మిగిలిన వాళ్ల ద్వారా రూ.47 వేలు చదివింపుల రూపంలో వచ్చాయి. కార్యక్రమం ముగిసిన తర్వాత జీపులో కుటుంబ సభ్యులు స్వగ్రామానికి బయలు దేరారు. కొలిమిగుండ్ల సమీపంలోని కస్తూర్బా పాఠశాల వద్దకు రాగానే ఆర్టీసీ బస్సు, జీపు ఎదురెదురుగా ఢీకొనడంతో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఆతర్వాత జీపు ప్రమాద స్థలంలోనే ఉండటంతో బ్యాగ్‌లో ఉన్న పర్సులో ఉంచిన బంగారు ఉంగరాలు, గొలుసు, డబ్బును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు.

### యువకుడి దుర్మరణం

కర్నూలు(సెంట్రల్): కర్నూలులోని తుంగభద్ర కాలనీలో ఇంటి పనిచేస్తుండగా అదుపు తప్పి కింద పడిపోయిన యువకుడు మృతి చెందాడు. నాలుగోపట్టణ పోలీసులు తెలిపిన మేరకు..నగరంలోని నిర్మల్ నగర్‌కు చెందిన భరత్ అనే యువకుడు తుంగభద్ర కాలనీలోని ఓ ఇంటి పని కోసం వెళ్లాడు. అక్కడ అనుకోకుండా స్పృహ తప్పి కింద పడిపోయి మృతి చెందాడు. మృతుడి తండ్రి బోయ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

డోన్ రూరల్: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో శనివారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు స్పందించి డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. అక్కడ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతుని వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసిన వారు డోన్ రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

### భార్య లేని లోకంలో ఉండలేక..

దేవనకొండ: భార్య లేని లోకంలో ఉండలేక ఆత్మహత్య చేసుకున్న పి.కోటకొండ గ్రామానికి చెందిన యువకుడు సూర్యప్రకాష్(29) చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ కలహాలతో ఈయన భార్య అరుణ(25) ఈనెల 1వ తేదీన ఆత్మహత్య చేసుకుంది. ఆ సమయంలో గ్రామశివారులో పొలం పనులు చేసుకుంటూ ఉన్న సూర్యప్రకాష్‌కు విషయం తెలిసింది. అదేరోజు ఉదయం 9:30 గంటల సమయంలో పొలంలోనే ఉన్న వేపచెట్టుకు ఉరి వేసుకున్నాడు. అతని తల్లి కురువ పులకుర్తి రామాంజనేయులు హుటాహుటిన వైద్యం కోసం దగ్గరలోని కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం రాత్రి సూర్యప్రకాశ్ మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.



క్యాజువాలిటీలో రోగులకు చికిత్స చేస్తున్న నర్సులు (ఫైల్)

# లైఫ్ డోనర్స్

- సేవకు ప్రతిరూపం నర్సులు
- రోగుల చికిత్సలో వైద్యుల తర్వాత వారే
- జిల్లా వ్యాప్తంగా 4 వేల మంది నర్సులు
- గ్రామాల్లో సీహెచ్ఓలదే ముఖ్యపాత్ర
- వైద్యుల తరహా సేవలందిస్తున్న వైనం
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

**రోగంతో బాధపడుతూ..**

**ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతూ ఆసుపత్రుల్లో చేరిన వారికి మేమున్నామని ఆదరణ, ఆప్యాయతతో ధైర్యం చెప్పే వారే నర్సులు. కుటుంబసభ్యులు కూడా చేయలేని సేవలను ఆసుపత్రుల్లో రోగులకు నర్సులు చేస్తున్నారు. అపస్మారక స్థితిలో వైద్యం అందుకుంటున్న వారికి అపారమైన జీవితాన్నిచ్చేది నర్సు. ఈ నెల 12న ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.**

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 776 మంది వివిధ రకాల హోదాల్లో నర్సులు పనిచేస్తున్నారు. వీరే గాక జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరో 1200 మందికి పైగా నర్సులు సేవలందిస్తున్నారు. వీరితో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో మరో 2వేల మంది రోగులకు చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు గ్రామాల్లో 400లకు పైగా కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు(ఎంఎల్‌హెచ్‌పీలు), వెయ్యి మంది దాకా ఏఎన్ఎంలు నర్సింగ్ సేవలు అందిస్తున్నారు. గత రెండు వారాలుగా జిల్లాలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పనిచేయడం లేదు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం సీహెచ్‌వోలు సమ్మె చేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామీణ ప్రజలు వైద్యం కోసం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలకు వెళ్తున్నారు. సాధారణంగా వైద్యులు రోగికి అవసరమైన పరీక్షలు చేయించి చికిత్స అందిస్తే ఆ తర్వాత ఆ చికిత్సను పర్యవేక్షించాల్సిన బాధ్యత నర్సులదే. రోగికి మందులు అందించడంతో పాటు అవసరమైతే వారికి సపర్యలు కూడా చేయాల్సి ఉంటుంది. దీనికి ఎంతో ఓపిక, సహనం అవసరం. ఈ మేరకు అవసరమైన మెళకువలన్నీ నర్సింగ్ విద్యలో వారికి నేర్పిస్తారు.

**ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు**

నర్సింగ్ వృత్తి వ్యవస్థాపకులు మిస్ ఫ్లోరెన్స్ నైటింగేల్ 1820వ సంవత్సరం మే 12వ తేది ఇటలీ దేశ సందర్శనకు వెళ్లిన సమయంలో ఇంగ్లిష్ దంపతులకు జన్మించారు. నైటింగేల్ బాగా ఆర్థిక, ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబంలో జన్మించిన కారణంగా ఆ తరంలోనే ఆమె స్కూల్ స్థాయి వరకు చదువుకున్నారు. క్రిమియన్ యుద్ధ సమయంలో క్షతగాత్రులకు ఆమె అందించిన వైద్యసేవలకు గాను అక్కడి ప్రభుత్వం ఆమెకు లేడి ఆఫ్ ల్యాంప్ అవార్డునిచ్చి సత్కరించింది. ఆ తర్వాత ఆమె లండన్‌లోని సెయింట్ థామస్ హాస్పిటల్‌లో నైటింగేల్ స్కూల్‌ను ప్రారంభించింది. నర్సింగ్ వృత్తికి ఆమె చేసిన సేవలకు గాను ప్రతి సంవత్సరం ఆమె జయంతి మే 12వ తేదిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా పాటిస్తున్నారు.

**నర్సుల సేవలు ఇలా..**

- మానవజాతికి సేవ చేయడమే నర్సుల ప్రాథమిక లక్ష్యం.
- వైద్యులు అందించే చికిత్సను రోగికి ఇవ్వడంలో సహాయం చేయడం.
- రోగికి, వికలాంగులకు శారీరక రక్షణ, మానసిక ధైర్యం కల్పించడం.
- రోగికి, వారి బంధువులకు ఆరోగ్యాన్ని పెంచడం, నివారణ మొదలైనవి తెలియజేయడం.
- వైద్య సిబ్బంది సహాయంతో వ్యక్తులకు, కుటుంబానికి, సంఘానికి సమగ్ర ఆరోగ్య రక్షణకు ప్రణాళిక రూపొందించడం.
- చికిత్సకు రోగి స్పందన అంచనా వేయడం, గమనించడం.
- ఆరోగ్యరక్షణకై చేసే పరిశోధనల్లో పాల్గొనడం.

**సమస్యలు పరిష్కరించాలి**



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నర్సెస్ అసోసియేషన్ రూమ్‌ను మరమ్మతు చేయించాలి. ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగా హెడ్ నర్సు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులు పెంచాలి. ఆసుపత్రిలో పనిచేస్తున్న హెడ్‌నర్సులు, స్టాఫ్‌నర్సులకు ఐదు రోజులు అదనపు క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయాలి. కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను రెగ్యులరైజ్ చేయాలి. వారికి వంద శాతం వేతనం ఇవ్వాలి.

–శాంతిభవానీ, ఉపాధ్యక్షురాలు, ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం, కర్నూలు

**ఎంతో సంతృప్తి**



నేను 2020 నుంచి మేల్ నర్సుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్నా. మధ్యలో కోవిడ్ సమయంలో కర్నూలులోని టిడ్కో గృహాల్లో కోవిడ్ డ్యూటీ చేశా. ఆ సమయంలో రోగులకు అందించిన సేవలు మరువలేనివి. ఎంతో ధైర్యం, మనోనిబ్బరంతో వారికి ధైర్యం చెబుతూ వైద్యసేవలు అందించా. ఆ తర్వాత తిరిగి గోనెగండ్ల పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సుగా చేరి, ప్రస్తుతం కోసిగి పీహెచ్‌సీలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నా. ఇక్కడ ప్రతిరోజూ 150 మంది దాకా ఓపీ రోగులు వస్తుంటారు. వారందరికీ ఎంతో ఓపికతో వైద్యసేవలు అందిస్తున్నా.

–పి. సుధాకర్, మేల్ నర్సు, కోసిగి పీహెచ్‌సీ



దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్న పీఠాధిపతి

## ఘనంగా ఖాదర్‌లింగ స్వామి ఉరుసు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న ఫకీర్ల విన్యాసాలు



గంధం ఊరేగింపు దృశ్యం

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ఆదివారం ఘనంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో దర్గా ప్రాంతం కిటకిటలాడింది. ప్రతి సంవత్సరం మాదిరిగానే తెల్లవారు జామున 3 గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తి ఇంటి నుంచి గంధం తీసుకెళ్లారు. డప్పువాయిద్యాలు, బ్యాండు మేళాల మధ్య ఈ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా ఫకీర్లు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గంధం దర్గాకు చేరిన అనంతరం ధర్మకర్తతో కలిసి దర్గా పీఠాధిపతి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దీంతో ఉరుసు ప్రారంభమైనట్లు ప్రకటించారు. కాగా ఈఉత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధర్మకర్త పూర్తిసాయిలో ఏర్పాట్లు చేశారు. దర్గాలో ఆదివారం తెల్లవారు జామున ప్రారంభమైన భక్తుల రద్దీ రాత్రి వరకు తగ్గలేదు. దర్శనం కోసం గంటకుపైగా వేచి ఉండాల్సి వచ్చింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**గంధం ఉత్సవానికి తరలివచ్చిన దర్గా పీఠాధిపతులు**

గంధం ఉత్సవానికి వివిధ దర్గాల పీఠాధిపతులు తరలివచ్చారు. బీదర్, రాయచూర్, సింధనూర్, కర్నూలు ఖాలిక్ లింగ దర్గాల పీఠాధిపతులు స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో కర్ణాటకలోని సర్మస్‌వలి దర్గా నిర్వాహకుడు దూద్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

## సింహ వాహనంపై పాండురంగడు



సింహవాహనంపై పూజలందుకుంటున్న పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం స్వామివారు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, గణపతి పూజ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి ప్రత్యేక అలంకరణలో పాండురంగడు సింహ వాహనంపై దర్శన మివ్వడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీసెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి శేష వాహనంపై దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

## మంత్రాలయంలో కన్నడ సినీ నటులు





పీఠాధిపతి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న సినీ నటి తార, హీరో ఉపేంద్ర కుటుంబ సభ్యులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై కన్నడ సినీ నటులు మంత్రాలయం వచ్చారు. ఆదివారం రాత్రి కన్నడ సినీ నటుడు ఉపేంద్ర కుటుంబ సభ్యులు, కన్నడ సినీ నటి శ్రీమతి తార వేర్వేరుగా మంత్రాలయం వచ్చారు. ముందుగా వారు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నటులకు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫలపూలమంత్రాక్షితులతో ఆశీర్వాదం చేశారు.

## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం

డోన్ టౌన్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని శ్రీసుధ సీబీఎస్సీ సిలబస్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన జన విజ్ఞాన ప్రాంతీయ ఉమ్మడి జిల్లాల వేదిక వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో అభివృద్ధితో పాటు సైన్స్ ఆలోచనలు పెరగాలని, శాస్త్ర పరిశోధనలకు మనం ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రజల ప్రగతి కోసం, స్వావలంబన కోసం, దేశ అభివృద్ధి కోసం, సామాజిక విప్లవం కోసం పని చేస్తుందన్నారు. జేవీవీ కార్యకర్తలు సైతం ఆ దిశగా పనిచేయాలన్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందించాలని చెప్పారు. శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు విరివిగా కళా జాతలు, చెకుముకి టాలెంట్ టెస్టులు, సైన్స్‌ఫేర్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టి, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రంగన్న, నాయకులు భాస్కర్, కర్నూలు, అనంతపురం ఉమ్మడి నాలుగు జిల్లాల ప్రధాన కార్యదర్శులు రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, ఆదేశేషు, మహేందర్‌రెడ్డి, ఖాజా హుస్సేన్, సుధీర్, జేవీవీ సమతా నాయకులు పాల్గొన్నారు.

### శ్రీశైలంలో నేడు గిరిప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, బయలు వీరభద్రస్వామి, ఔటర్‌రింగ్ రోడ్డు, మల్లమ్మ కన్నీరు, రుద్రవనం నుంచి నందిమండపం వరకు చేరుకుంటుంది. భక్తులలో భక్తిభావాలను మరింతగా పెంపొందింపజేసేందుకు ఈ గిరిప్రదక్షిణ నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

## ప్రాణం తీసిన బావి పూడిక



బోయ రంగనాయుడు (ఫైల్)

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన యువకుడు ఈత వెళ్లి బావి పూడికలో చిక్కుకుని మృతి చెందాడు. గ్రామంలోని బోయ చంద్రన్న (దుబ్బన్న) చిన్న కుమారుడు బోయ రంగనాయుడు (22) మండలంలోని బ్యాతోలి గ్రామంలో తమ బంధువుల దేవర ఉత్సవానికి వెళ్లాడు. ఆదివారం బురాన్‌దొడ్డి రోడ్డులోని వంక బావి దగ్గర దుస్తులు శుభ్రం చేసుకునేందుకు బంధువులు వెళ్లారు. వారి వెంట బోయ రంగనాయుడు మరి కొంతమంది ఈత కోసం వెళ్లారు. అయితే బోయ రంగనాయుడు బావిలోకి తల కిందులుగా దూకాడు. బావి ఎక్కువ లోతు లేకపోవడం, పూడిక ఉండటంతో రంగనాయుడు చిక్కుకున్నాడు. బావిలోకి దూకిన యువకుడు ఎంతకు బయటకు రాకపోవడాన్ని గమనించిన బంధువులు బావిలో గాలించారు. పూడికలో చిక్కుకున్నట్లు గమనించి బయటకు తీశారు. అయితే అప్పటికే ఊపిరాడక అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడుని స్థానికులు గమనించి ప్రాణం పోయినట్లు నిర్ధారించుకున్నారు. బోయ రంగనాయుడు హైదరాబాద్‌లో వలస కూలీగా పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.



గార్దబాల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

## రసవత్తరంగా గార్ధభాల పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన గార్ధభాల పోటీలు రసవత్తరంగా సాగాయి. దేవాలయం నుంచి అంకాలమ్మ చౌరస్తా వరకు గార్ధభాలల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. జిల్లాలోని ఆళ్లగడ్డ, చాగమర్రి, అవుకు, వెలుగోడు మండలాలకు చెందిన 13 గార్ధభాలు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీవీ ప్రసాదరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి ప్రారంభించారు. 220 కిలోల ఇసుక బస్తాలతో నిర్ణీత పది నిమిషాల వ్యవధిలో ఎక్కువ దూరం పరిగెత్తి విజేతగా నిలిచిన అవుకు మండలం మెట్టుపల్లెకు చెందిన నరసింహ గార్ధభం రూ. 15 వేలు కైవసం చేసుకుంది. ఆళ్లగడ్డ మండలం బాచిపల్లెకు చెందిన చిన్నరంగ గార్ధభం రెండవస్థానంలో నిలిచి రూ. 10 వేలు, చాగలమర్రి మండలం పెద్దవంగలి పాములేటి గార్ధభం మూడవస్థానంలో నిలిచి రూ. 7,500 గెలుపొందాయి. వెలుగోడు మండలం వేల్పనూరు సురేంద్ర గార్ధభం నాల్గవస్థానంలో నిలిచి రూ. 5వేలు, ఆళ్లగడ్డ మండలం బాచిపల్లె నాగేషు గార్ధభం ఐదవస్థానంలో నిలిచి రూ. 2,500 దక్కించుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు కరిమద్దెల మురళీ, గడ్డం నాగేశ్వరరెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి, సహదేవరెడ్డి, మనోహర్, రాజు, నాగేంద్ర, శిలువయ్య పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దళితుల హత్యలు బాధాకరం

- మాదిగ జేఏసీ కమిటీ చైర్మన్ ఆర్‌జే ప్రకాష్ మాదిగ



మాట్లాడుతున్న ఆర్‌జే ప్రకాష్ మాదిగ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోతోందని మాదిగ జేఏసీ కమిటీ చైర్మన్ ఆర్‌జే ప్రకాష్ మాదిగ అన్నారు. మొత్తం 11 నెలల కాలంలో ఇద్దరు దళిత నేతలను హత్య చేయడం బాధాకరమన్నారు. కర్నూలు జిల్లాలో దళిత నేతలు చిప్పగిరి లక్ష్మీనారాయణ, కర్నూలులో మాజీ కార్పొరేటర్ సంజన్న దారుణ హత్యకు గురైనా సరైనా విచారణ చేయడంలో ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందని ప్రశ్నించారు. కర్నూలులోని మీడియా పాయింట్‌లో ఆదివారం మాదిగ నేతలు సమావేశమై జేఏసీగా ఏర్పాడ్డారు. చైర్మన్‌గా ఆర్‌జే ప్రకాష్, ఉపాధ్యక్షుడిగా టీఎంరమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా పత్తికొండ సుభాష్ మాదిగలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చిప్పగిరి లక్ష్మీనారాయణ కేసులో సూత్రధారులపై ఎందుకు విచారణ జరపడంలేదని ప్రశ్నించారు. వైకుంఠం కుటుంబీకులపై అనుమానం ఉందని హతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అక్రమాలు, షటిల్ మెంట్ల గొడవలతోనే చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యకు గురైనట్లు పోలీసులు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. కార్పొరేటర్ సంజన్న హత్యపై కూడా పోలీసుల సరైన విచారణ చేయలేదన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకల్లు సోమసుందరం పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆర్‌సీఎం పాఠశాల పూర్వ విద్యార్థులు

### పాతికేళ్ల తర్వాత..

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం వేడుకగా సాగింది. 1999–20లో 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు దాదాపు 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరి ఒకరినొకరు పలకరించుకోని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులు భాస్కర్‌రెడ్డి, జోజిరెడ్డి, మౌలాలి, ఆంథోనమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజ్‌కుమార్ రెడ్డి, సుందరయ్యలను ఘనంగా సన్మానించారు.

### వైభవంగా నరసింహ జయంతి



స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో నరసింహ స్వామి జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, సూపరింటెండెంట్ రామ్ మోహన్‌రావు ఆధ్వర్యంలో వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవలు, ప్రత్యేక పూజలు, విశ్వక్సేనారాధన, నరసింహహోమం పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రంలో మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణల మధ్య స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

### నాపరాతి గనుల్లో నష్టాలపాలై..

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెకు చెందిన పుచ్చా తిరుమలరెడ్డి (44) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిరుమలరెడ్డికి నాపరాతి గనులతో పాటు పాలీస్ బండల ఫ్యాక్టరీ కూడా ఉంది. అయితే గనుల నిర్వహణలో నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. కొద్ది రోజుల నుంచి ఆర్థిక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తిరుమలరెడ్డిని అనారోగ్య సమస్యలు వేధించాయి. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి అందరూ నిద్రించిన తర్వాత ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. కాగా అతని బరువుకు ఫ్యాన్ కిందకు ఊడిపడటంతో తలకు గాయమైంది. పెద్దగా శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు నిద్రలేచి వెంటనే గాయపడిన తిరుమలరెడ్డిని కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య అనసూయ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.